
# మరో నిర్మల

- వై. కె. మూర్తి



ఆటో దిగి ఇంట్లోకి వస్తున్న నిర్మలను చూసి ఆశ్చర్యపోయింది శాంతమ్మ.

'ఇదేమిటీ, ఉత్తరం పత్తరం లేకుండా ఊడిపడ్డావ్?' అంటూ ప్రశ్నించింది.

'ఏం ఉత్తరం రాయకుండా రాకూడదా?' నిలదీసినట్లు ప్రశ్నిస్తున్న కూతురి మాటల్లోని కాఠిన్యానికి గుండె దడదడలాడింది శాంతమ్మకి.

ఇదేదో కొంప ముంచే పనే చేసి వచ్చింది అనుకుంది, కూతురి స్వభావం తెలుసు కాబట్టి.

అయినా అంతటితో ఆగక, 'మీ ఆయన రాలేదా?' అంటూ మళ్లీ అడిగింది.

తల్లి మాటలకు ఒళ్లు మండిపోయింది నిర్మలకి.

'ఇంక అతన్ని మా ఆయన అనకు. అతన్తో సంబంధం తెగతెంపులు చేసుకొచ్చాను. కావలిస్తే చూడు–' అంటూ హ్యాండ్ బ్యాగ్ తెరచి అందులో నుండి మంగళసూత్రాలు బయటికి తీసి చూపించింది.

శాంతమ్మ స్తంభించిపోయింది. వెర్రిదానిలా చూస్తుండిపోయింది. ఎంతసేపు నిలబడిందో కాళ్లూ చేతులూ కడుక్కుని, వంటింట్లోకి వెళ్లి కాఫీ కలుపుకుని ముందు గదిలోకి వచ్చి కూర్చుని పేపరు చూస్తూ కాఫీ తాగుతోంది.

శాంతమ్మ మళ్లీ ప్రారంభించింది–

'ఏమిటే నువ్వు చెబుతున్నది? ఏం జరిగింది? ఏమైనా పోట్లాడుకున్నారా? మీ అత్తగారూ, మామగారూ ఊళ్లో లేరూ?'

తల్లి మాటల్ని సగంలోనే తుంచి అన్నది నిర్మల–

'అందరూ శుభ్రంగా ఊళ్లోనే వున్నారు. మేడ మీద మరో గది కట్టిస్తున్నారు. వాళ్ల రెండో అమ్మాయి పురిటికి వచ్చింది. మామగారనబడే ఆ ముసలాయనకు జ్వరం, ఆయన భార్యకు

కీళ్లనొప్పులు...'

కూతురి మాటల్లోని వ్యంగ్యం అర్థమైంది శాంతమ్మకి.

'ఈ పెడసరం మనిషి కాపురం ఎలా చేస్తుందోనని తనకు మొదట నుండీ భయమే. అయినా ఇలా అకస్మాత్తుగా పారిపోయి వస్తుందని ఊహించలేదు. జరిగిన విషయం మెల్లిగా రాబట్టుకోవాలి' అనుకుంటూ భర్త రాకకు ఎదురుచూస్తూ నిమిషమొక యుగంగా గడపసాగింది శాంతమ్మ.

మరో గంట తర్వాత రావు వచ్చాడు. కూతురు వచ్చినట్లు చెప్పింది శాంతమ్మ. ఆమె ఆందోళన అర్థమైందాయనకు. మెల్లిగా నిర్మలను కదిపి విషయం తెలుసుకున్నాడు.

. . . . .

నిర్మలకు ఏ సంబంధమూ కుదరడం లేదు. కూతురి పెళ్లి చేసేయాలని శాంతమ్మ ఎంత ఆతృత పడుతోందో అంత ఆలస్యమవుతోంది. ఆ ఆలస్యానికి కారణం నిర్మల నిర్ణయమే.

'వరకట్నం ఆశించే అబ్బాయిని నేను పెళ్లి చేసుకోను!' అన్నది నిర్మల ప్రతిజ్ఞ.

'అలా అంటే ఎలాగే, ఈ రోజుల్లో కట్నం తీసుకోని వాళ్లెవరు చెప్పు?' అని సమర్థించేది శాంతమ్మ.

'ఏమో అదంతా నాకు తెలీదు. నా నిర్ణయం అది. నేను పెళ్లి చేసుకోకుండా అయినా వుంటాను కానీ, కట్నం తీసుకునే వాడ్ని ఒప్పుకోను' నిర్మల గట్టిగా పట్టుబట్టింది.

కొన్ని సిద్ధాంతాలుండాలని ఆమె భావన.

చివరికి అందరికీ నచ్చిన ఒక సంబంధం కుదిరింది. పెళ్లయి అత్తగారింటికి వెడుతున్న నిర్మలకు బుద్ధులు చెప్పింది శాంతమ్మ.

'అమ్మా! మాకు బి.ఏ. క్లాసులో నాటకంగా వున్న 'శాకుంతలం'లో కణ్వుడు ఇలాగే చెబుతాడు శకుంతలకు'- అంటూ నవ్వింది నిర్మల.

'అవును మరి... మన సంప్రదాయం అది. పూర్తిగా భిన్నమైన వాతావరణంలోకి అడుగుపెట్టబోయే అమ్మాయికి ఎంత అణకువ, సర్దుకుపోయే తత్త్వం వుంటే, అంత మంచిది.'

తండ్రి మాటల్ని త్రోసిపారేసింది.

'ఏమిటి నాన్నా... నీవు కూడా చాదస్తంగా మాట్లాడతావు? ఆడదే ఎందుకు సర్దుకుపోవాలి? మగాడు మారకూడదా? అసలు అందుకే అన్నాను నాకు పెళ్లి వద్దు అని. ఇలాంటివన్నీ నాకసహ్యం...'

కూతురి ఆవేశాన్ని చూసి భయపడిపోయింది శాంతమ్మ. ఈ మాటలన్నీ అల్లుడు ఎక్కడ వింటాడోనని ఆమె బాధ.

ఇంకో క్షణంలో 'నేనెందుకు వెళ్లాలి, అతన్నే ఇక్కడ వుండమను' అని అన్నా అనగలదు అనుకుంటూ శాంతమ్మ ఏదో సర్ది చెప్పింది.

ఎలాగైతేనేం అత్తగారింటికి వెళ్లింది నిర్మల.

ఆమె దగ్గరి నుండి ఉత్తరం వస్తే శాంతమ్మకు భయం- ఎప్పుడే చిలిపి కజ్జా పెట్టు కుంటుందోననీ, అల్లుడికి ఎక్కడ కోపం వస్తుందోనని.

ఆరు నెలలు గడిచాయి.

'హమ్మయ్య! ఫరవాలేదు. ఇంక దాని కడుపునో కాయకాస్తే ఏ పేచీ వుండదు' అనుకుంది శాంతమ్మ.

సరిగ్గా అలాంటి సమయంలోనే ఊడిపడింది నిర్మల. జరిగిన విషయం తెలుసుకున్నాడు రావు.

. . . . .

నిర్మల ఆడపడుచు పురిటికి వచ్చింది. ఆ రోజు ఏదో మాటల సందర్భంలో 'పక్కింటి పద్మకు పెళ్లి నిశ్చయమైందట' అన్నది నిర్మల అత్త.

నిర్మల వరుని వివరాలు అడిగింది.

'కట్నమెంత?' అన్నది యథాలాపంగా నిర్మల ఆడపడుచు.

'పెళ్లి అనేసరికి వెంటనే కట్నం ఎందుకు గుర్తొస్తుంది?' అని ప్రశ్నించింది నిర్మల.

'ఇది బాగుంది వదినా, కట్నం లేకుండా పెళ్లేమిటి? పంచదార లేకుండా పాయసమా?' అన్నది ఆడపడుచు.

'కాకపోతే, మన ఆడవాళ్ల వల్లే ఈ కట్నపిశాచి ఇలా విజృంభిస్తోంది' అంది నిర్మల.

కోడలి మాటలకు అత్త అడ్డొచ్చింది.

'తప్పేముందే? కొడుక్కి ఆస్తిలో భాగమిస్తారుగా? అలాగే కూతురికీనూ. కాకపోతే

అది ఆమె మొగుడికిస్తారు. ఎవరికిస్తే ఏముంది? ఆలూమగలన్నాక ఒకటే కదా!'

'ఆహా! ఒకటే ఎందుకు కాదు? అందుకే కాబోలు కట్నం తేలేదని కోడల్ని చంపుతుంది అత్త...' నిర్మల ఆవేశంతో ఏదేదో అనసాగింది.

'అబ్బా... వదినా! ఎందుకంత కోపం? మీవాళ్లు మాత్రం నీ పెళ్లికి కట్నం ఇవ్వలేదూ?' అన్నది ఆడపడుచు.

'ఛీ! కట్నమా? ఆ మాటంటేనే నాకసహ్యం. ఏం నీకు తెలీదూ? కట్నం తీసుకోలేదు కాబట్టే, మీ అన్నయ్యని చేసుకున్నాను' అంది నిర్మల.

ఏదో అనబోయిన ఆడపడుచు మాటను అత్తయ్య మధ్యలో కలుగజేసుకుని విషయాన్ని మార్చేసింది. కానీ ఎందుకో నిర్మలకు అనుమానమొచ్చింది- ఒకవేళ శేఖర్ కట్నం తీసుకున్నాడేమోనని?

ఆ విషయమే అడిగింది కూడా.

అతను నవ్వి, 'నీకా అనుమానం ఎందుకొచ్చింది?' అని తేల్చేశాడు.

ఆ మర్నాడు అత్త గదిలోంచి వినిపిస్తున్న మాటలు నిర్మలను ఆశ్చర్యపరిచాయి.

'ఏమిటమ్మా... అన్నయ్య పెళ్లికి లక్ష కట్నం తీసుకున్నారుగా? వదిన లేదంటోందేం?'

'ఉష్... మెల్లిగా? ఈ మొండి శిఖండికి కట్నం ఇవ్వడం ఇష్టం లేదుట! పాపం వాళ్ల అమ్మా నాన్నా బతిమాలారు- కట్నం తీసుకున్న విషయం దానికి చెప్పకండి- అని'.

'సరే, దాందేముంది అన్నాం. అందుకే ఎవరికీ, ఆఖరికి నీక్కూడా ఈ విషయం చెప్పలేదు.'

నిర్మలకు విషయం బోధపడింది- అందరూ తనను మోసం చేస్తున్నారన్నమాట!

ఆమె సిగ్గుతో దహించుకుపోయింది.

'ఎంత దగా! ఆఖరికి కన్నతల్లిదండ్రులు కూడా మోసం చేయడమా?' అని బాధపడింది. 'వాళ్లు మోసం చేశారు!' అనడం కంటే 'తను మోసపోయింది!' అని అర్థమయ్యేసరికి, ఆ అవమానం సహించరానిదైంది. ఆ రోజంతా ఎవరితో మాట్లాడకుండా గదిలో తలుపులేసుకుని కూర్చుంది. విషయం తెలీక అందరూ సతమతమవసాగారు. అన్నం, నీళ్లు లేకుండా ఆ రోజంతా గడిపిన నిర్మల అందరూ వచ్చి గొడవ చేస్తే రాత్రి ఎనిమిది గంటలకి తలుపు తీసింది.

'పోలీసుల్ని పిలవాలనుకున్నాను' అన్నాడు శేఖర్ సీరియస్‌గా.

'ఆ పని చేయవలసింది నేను' అన్నది నిర్మల తీక్షణంగా చూస్తూ.

'ఏమిటొదినా ఆ మాటలు?' అన్న ఆడపడుచును వారిస్తూ-

'నిజం చెప్పండి! ఎందుకు నా నుండి దాచారు లక్ష కట్నం తీసుకుని, తీసుకోలేదని అబద్ధమెందుకు చెప్పారు? మీకు సిగ్గుగా లేదూ?' భద్రకాళిలా ఊగిపోతూ అరిచింది నిర్మల.

'ఇది మరీ బాగుందే. మీ అబ్బా అమ్మా చెప్పొద్దన్నారు. అందుకే చెప్పలేదు. మధ్య మాదేం తప్పు? అయినా కట్నం లేకుండా ఇంత ఆస్తీ, అంతస్తు వున్న ఇంజనీరు మొగుడొస్తాడని ఎలా అనుకున్నావ్?' ఈసడించింది అత్త.

'ఛీ! ఇంక మీతో ఒక్క మాట మాట్లాడను. ఇచ్చేయండి తక్షణం, మా డబ్బు మాకిచ్చేయండి. ఒక్క క్షణం ఆలస్యం చేశారంటే మర్యాద దక్కదు' ఆవేశంగా అన్నది నిర్మల.

'ఏం చంపుతావా?' ఎగతాళిగా నవ్వుతూ అన్నాడు శేఖర్.

'ఛీ! కుక్కకు వేసిన ఎంగిలి మెతుకుల్ని మళ్లీ ఏరుకుని తినడమా? బ్యాంకులోనే దాచుకుని కులకండి. ఇంక మీకూ, నాకూ సంబంధం లేదు. ఇవిగో మంగళసూత్రాలు-' అంటూ గబగబా మెళ్లోనివి తీసి విసిరింది శేఖర్ మీదికి.

'ఒరేయ్! తీసుకోకు. దానికి సిగ్గులేకపోతే, నీకు లేదూ? నీ మెళ్లోని పుస్తెలతాడు మాకెందుకు? నువ్వే వుంచుకో' అంటూ అత్త వాటిని నిర్మల పైకి గిరాటేసింది.

'ఆల్‌రైట్! ఈ బంగారం మాత్రం మీకెందుకివ్వాలి? రెండు రోజులు గడువిస్తున్నాను. మా నాన్న పేరుతో లక్షకి చెక్కు పంపకపోతే స్వయంగా నేనే కేసు పెడతాను. మీకూ, నాకూ ఇక సంబంధం లేదు-' అంటూ పుట్టింటికి

వచ్చేసింది నిర్మల.

. . . . .

భయంతో, అవమానంతో గడ్డకట్టుకుపోయి కూర్చుంది శాంతమ్మ.

'ఇప్పుడేం చేయడం?' ఆలోచిస్తున్నాడు రావు.

రెండు రోజుల్నుంచీ ఇదే వరస. ఆ ఇంట్లో రావు అంతర్ముఖు డవుతున్నాడు. తాను చేసింది తప్పని అతనికి అర్థమైంది. నిర్మల మనస్తత్వం తెలిసీ తను అలా చేసి వుండకూడదు అనుకున్నాడు. కానీ విధి నిర్ణయం ప్రకారం జరిగిపోయింది. 'ఇప్పుడేం చేయడం?' అని ఆలోచిస్తున్నాడు.

'మీరు ఒకసారి శేఖర్‌తో మాట్లాడి రండి' అంది శాంతమ్మ.

'ఒకసారి చేసిన తప్పును మళ్లీ చేయడమా? ఇంక నేనై నేను వాళ్లతో మాట్లాడను. నిర్మల ఏం చెబితే అది చేస్తాను' అన్నాడు రావు.

శాంతమ్మ నిర్ఘాంతపోయింది.

'చిన్నపిల్ల... దాని మాటలు వింటారేమండీ?' అన్నది.

'అదంతా మీ కాలం. ఇప్పుడు చిన్నపిల్లలే ఎంతో తెలిసినవాళ్లు. అసలు దాని పెళ్లి దాని ఇష్ట ప్రకారంగా చేయకపోవడం మనం చేసిన పెద్ద తప్పు. ఇంక నువ్వేం మాట్లాడకు-' అంటూ అక్కడి నుంచి వెళ్లిపోయాడు రావు.

. . . . .

ఆ తర్వాత చాలా ఏళ్లు గడిచాయి. ఎన్నో మార్పులు వచ్చాయి. నిర్మల జీవితంలోనూ ఎంతో మార్పు. ఇప్పుడామె కాలేజీ ప్రిన్సిపాల్. కొన్ని వందల మంది ఆడపిల్లలకు చదువు చెబుతున్న సంస్థకు అధికారిణి. వాళ్లల్లో మంచి భావాలను పాదుకొల్పాలన్న తపన గల మహిళ.

. . . . .

'లోపలికి రమ్మని చెప్పమంటారా అమ్మగారూ?' ప్యూన్ మాటలతో ఈ లోకంలోకి వచ్చిపడింది నిర్మల. ఆమె చేతిలో ఒక పాత విజిటింగ్ కార్డు వుంది. దాన్ని చూసి ఆలోచనల్లో పడి, గతంలోకి జారిపోయిన నిర్మల 'లోపలికి రమ్మను' అంది పొడిగా. ఆ విజిటింగ్ కార్డు ఒకప్పటి తన భర్త రాజశేఖర్‌ది. కానీ అదెంత పాతబడిపోయింది! అతను ఉద్యోగంలో ప్రమోషన్లు పొంది ఈపాటికి చాలా పెద్ద పొజిషన్లోనే వుండి వుండాలే? అనుకుంది. ఈలోగా శేఖర్ లోపలికి వచ్చాడు. అతన్ని గుర్తుపట్టలేకపోయింది నిర్మల. బాగా ముసలివాలకం వచ్చేసింది. చాలా సాదా బట్టలు ధరించి వున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే పూటకు గతిలేని వాడిలా వున్నాడు. మౌనంగా వున్న నిర్మలతో ఎలా మాట్లాడాలో తెలీలేదు శేఖర్‌కి.

చివరికి నిర్మలే ప్రారంభించింది- 'ఎవరికైనా సీటు కావాలా?' అంటూ.

'ఇతను మళ్లీ పెళ్లి చేసుకున్నాడా? పిల్లలున్నారా? ఈ స్థితిలో ఎందుకున్నాడు?...' ప్రశ్నలన్నీ చుట్టుముట్టాయి నిర్మలను.


## ఉగాది స్పెషల్

ఏప్రిల్ 2003 పత్రిక
స్వభాను ఉగాది ప్రత్యేక సంచికగా,
నూతన సంవత్సర శుభకామనలతో,
వసంత వైభవంతో, మధుమాసపు
సందళ్లతో మీ ముందుకు రానున్నది.
**1/4** డెమ్మీ సైజులో ఎక్కువ పేజీలతో
షడ్రుచుల మేళవింపుతో
ఉగాది కానుకగా
అందించే మా ప్రయత్నానికి
రచయితల సహకారాన్ని అర్థిస్తున్నాం.
మన మాసపత్రికను శాశ్వత విలువలతో
సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడానికి
సకాలంలో మీ రచనలను
పంపవలసిందిగా కోరుతున్నాం.

*వెల:* రూ.**10/-**

చిరునామా: పత్రిక
మన మాసపత్రిక
79బి, జర్నలిస్ట్స్ కాలనీ,
జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500 033.

'మా అమ్మాయి ఇంటర్మీడియెట్ పాసై నాలుగేళ్లయింది. పెళ్లయిపోతే చదువు మానేసింది. పెళ్లయిన రెండేళ్లకే మా అల్లుడు యాక్సిడెంట్‌లో పోయాడు. ఇకముందు జీవితమంతా ఎలా గడపడమా అన్నది సమస్య. బలవంతం చేసి కాలేజీలో చేర్పించాలని వచ్చాను'- ఎవరో అధికారి ముందు దోషి మాట్లాడుతున్నట్లుగా వుంది అతను మాట్లాడుతుంటే.

నిర్మల శ్రద్ధగా విన్నది.

ఆనాటి నిర్మల రూపం ఇంకా మరచిపోలేదు శేఖర్. నిర్మల ఎంత నిందించినా పడడానికి సిద్ధమై వచ్చాడు శేఖర్. కానీ నిర్మల ప్రశాంతంగా వుండటం అతనికి ఆశ్చర్యమే కలిగించింది.

'అడ్మిషన్స్ ఇంకా ప్రారంభం కాలేదు. అప్లికేషన్ ఫారం ఇస్తాను. పూర్తిచేసి ఇవ్వండి' అంటూ ప్యూన్‌ను పిలిచి ఫారం తెప్పించింది నిర్మల.

డబ్బివ్వబోయాడు శేఖర్.

వారించిందామె.

'మీరు విజిటర్స్ రూంలో కూర్చోండి. మీ అమ్మాయిని పంపండి' అన్నది.

లోపలికి వచ్చిన అమ్మాయిని చూసి ఆశ్చర్యపోయింది నిర్మల. ఇంకా వికసించని గులాబీలా వున్న ఈ పసిపాపకు పెళ్లి... అంతలోనే వై.... ఆ మాట అనుకోవడానికి ఆమె మనసు అంగీకరించలేదు. ఎంతో ముచ్చటగా వున్న ఆ అమ్మాయి ముఖంలో బొట్టు లేకపోవడం గమనించింది నిర్మల. శేఖర్ మూర్ఖత్వం తలచుకుని మండిపోయింది.

అవసరమైన ఏర్పాట్లన్నీ చేసి-

'మీ నాన్నను ఈ అడ్రస్‌కు రమ్మని చెప్పు. నీవూ మీ నాన్నతో రా!' అంటూ తన అడ్రసున్న కాగితం ఇచ్చింది నిర్మల.

. . . . .

ఆ సాయంత్రం విషయమంతా తెలిసింది నిర్మలకి.

శేఖర్, అతని అన్నదమ్ములు ఆస్తుల్లో వాటాలు పంచుకున్నారు. శేఖర్ ఉద్యోగంలో అవినీతికి పాల్పడ్డాడనే నేరారోపణపై సస్పెండ్ చేయబడ్డాడు. అప్పటికే అతనికి రెండో పెళ్లి జరిగింది. ఈతి బాధలెక్కువయ్యాయి. ఉద్యోగం ఊడిపోయింది. పుట్టిన పిల్లలు తిండిలేక రోగాల పాలబడ్డారు. ఆ అవస్థల్లో చదివించలేక పెద్దకూతురికి పెళ్లి చేశాడు ఎలాగో. ఆ అమ్మాయి భర్తను కోల్పోయి పుట్టిల్లు చేరింది. ప్రైవేటుగా ఏదో సంస్థను నడుపుతున్నా, పెట్టుబడి లేక అది చిక్కుల్లో వుంది.

ఇలా తన అవస్థలన్నీ ఏకరువు పెట్టి ఆఖరికి శేఖర్ అన్నాడు బాధగా- 'ఇదంతా నిన్ను ఇంటి నుండి తరిమేసినందుకు ఫలితం' అని.

నిర్మల నవ్వింది.

'అలాంటి సెంటిమెంట్స్ పెట్టుకోకండి. అదంతా ఎందుకుగానీ, మీ శ్రీమతిని తీసుకు రాలేదేం?' అని ప్రశ్నించింది.

'అమ్మ పోయి మూడేళ్లు అయిందండీ' బాధగా అన్నది శేఖర్ కూతురు రేఖ.

'అయామ్ సారీ' అని కాసేపాగి, రేఖకి కాలేజీలో సీటు రావచ్చు. కానీ హాస్టల్లో అకామడేషన్ దొరకదు. ఎందుకంటే నీళ్ల వసతి లేదు. సీనియర్ స్టూడెంట్స్‌కే వసతి లేక బాధపడుతున్నారు' అన్నది నిర్మల.

'అయ్యో, ఇక్కడ ఒంటరిగా ఎలా పెట్టను ఆడపిల్లను? హాస్టల్ వుందనే ధైర్యంతోనే ఈ ఊరికి వచ్చాను' అన్నాడు శేఖర్.

'శేఖర్! రేఖ మా ఇంట్లోనే వుండి చదువుకుంటుంది. తన చదువు బాధ్యతంతా నేనే వహిస్తాను. మీకిష్టమేనా?' అన్నది నిర్మల.

'మరో నిర్మలను చేస్తానంటే నాకేం అభ్యంతరం?' మనస్ఫూర్తిగా అన్నాడు శేఖర్.

## ఏం మిగిలిందని

ఏం మిగిలిందని
వార్ధక్యంలో
నెమరు వేయడానికి
గత బాల్య స్మృతులు తప్ప
ముడతలు పడ్డ చర్మం
మసకబారిన కళ్లు
ఊడిన పళ్లు
ఏం మిగిలిందని
ఒక్క బోసినవ్వు తప్ప.

- కలవకుంట్ల.